వైఎస్ఆర్
కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక

ఆదివారం 12 ఏప్రిల్ 2026

## వైభవంగా శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి గ్రామోత్సవం



దువ్వూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త: మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి సన్నిధి నందు వెలసి ఉన్న శ్రీ గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర నాగ వీరభద్ర నవగ్రహ పున ప్రతిష్ట ఉత్సవాలలో భాగంగా శనివారం శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, గణపతి, నందీశ్వర స్వాముల గ్రామోత్సవ కార్యక్రమాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. 8వ తేదీ నుండి జరుగుతున్న ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలలో వివిధ రకాల పూజలు, అభిషేకాలు నిర్వహించి శనివారం అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళ హారతి, యంత్ర ప్రతిష్ట, శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు నిర్వహించారు.

## మధ్యాహ్న భోజనంపై ఆరా



బద్వేలు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం సందర్శించిన టిడిపి నియోజకవర్గ ఇన్చార్జ్ రితేష్ రెడ్డి విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తరగతి గదులను పరిశీలించి డిజిటల్

2వ పేజీలో

# కీర్తన హత్య కేసులో ట్విస్ట్

- పోలీసుల మూడు రౌండ్ల కాల్పులు
- పోలీసులపై దాడికి దిగిన నిందితుడు వెంకటేష్
- ఇద్దరు పోలీసులకు గాయాలు
- క్రిమినల్స్ పై కఠినంగా వ్యవహరిస్తాం : ఎస్పీ
- వెంకటేష్‌ను ఎన్ కౌంటర్ చేయాలని ఖాజీపేటలో ధర్నా



రాజంపేట ఏప్రిల్ 11 ప్రభాతవార్త

ప్రేమించలేదని దారుణంగా గొంతు కోసి హత్య చేసిన కీర్తన హత్య కేసులో మరో సంచలనం జరిగింది. కీర్తన బంధువులు, కుటుంబ సభ్యులు ఆగ్రహంతో ఉండడంతో సురక్షితమైన ప్రాంతానికి నిందితుడు వెంకటేష్ ను తరలించే ప్రయత్నం పోలీసులు చేస్తుండగా ఊహించని రీతిలో తప్పించుకున్నాడు. పోలీసులపై దాడి చేయడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. వెంటనే జిల్లా ఎస్పీ నచికేత్ షెల్కే నచికేత్ విశ్వనాథ్ కు ఖాజీపేట పోలీసులు సమాచారం అందించారు. వెంటనే మరో సెర్చ్ టీం ను ఏర్పాటు చేశారు. వెంకటేష్ ఎక్కడ ఉన్నది పోలీసులు కనుగొన్నారు. పట్టుకునే ప్రయత్నంలో నిందితుడు వెంకటేష్ ఎదురు దాడికి దిగడంతో పోలీసులు మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. వెంకటేష్ కాళ్లపై కాల్పులు జరపడం తోగాయాలు తగిలి పోలీసులకు దొరికిపోయాడు. వెంటనే కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ దాడిలో శివయ్య, నరసింహులు అనే ఇద్దరు కానిస్టేబుల్ లకు గాయాలయ్యాయి. వారిని కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులను పరామర్శించిన కడప జిల్లా ఎస్పీ నచికిత్ విశ్వనాథ్,మైదుకూరు డిఎస్పీ రాజేంద్ర ప్రసాద్. మరోవైపు కడప రిమ్స్ లో కీర్తన మృదేహానికి శనివారం పోస్టుమార్టం పూర్తయింది. మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించే క్రమంలో తల్లిదండ్రులను ఓదార్చడం బంధువుల వల్ల కాలేదు. కీర్తన తల్లి రోదన అక్కడ ఉన్న వారిని కలచి వేసింది. కీర్తన మృతదేహం ఇంటికి చేరిన తర్వాత గ్రామంలో విషాదం అలుముకుంది. మరోవైపు ఈ హత్య కేసులో వెంకటేష్ తో పాటు అక్కడికి వచ్చిన ప్రవీణ్ అనే యువకుడిని తప్పించే ప్రయత్నం జరుగుతుందంటూ స్థానికంగా ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ముందు హత్య చేసిన వెంకటేష్ను ఎన్కౌంటర్ చేయాలి మరో మారు గ్రామస్తులు సాయంత్రం కాజీపేట బస్టాండ్ కూడలిలో ధర్నా నిర్వహించారు. పోలీసులు నచ్చజెప్పి విరమింప చేశారు.

డాక్టర్లతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరిన ఎస్పీ

### అమ్మాయిల జోలికి వస్తే ఖబడ్దార్

ప్రేమ పేరుతో అమ్మాయిలను హత్య చేసే స్థాయికి ఉన్మాదులుగా మారిన వారిని వదిలిపెట్టమని క్రిమినల్స్ పట్ల కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ హెచ్చరించారు. రిమ్స్ ఆస్పత్రిలోకాజీపేట పోలీస్ స్టేషన్‌లో పోలీసులు శివయ్య, నరసింహులుకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ కీర్తన అనే అమ్మాయిని నిందితుడు వెంకటేష్ గోరంగా మర్డర్ చేశారని అన్నారు. ప్రేమ వ్యవహారమే ఈ హత్యకు కారణం.కీర్తన అనే అమ్మాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువకుడు హత్యకు పాల్పడ్డాడనీ పేర్కొన్నారు. పోలీసులపై నిందితుడు దాడికి పాల్పడిన విషయాన్ని ఎస్పీ వివరించారు.మా పోలీసులకు ఈ ఘటనలో గాయాలయ్యాయి.నిందితునికి పోలీసులు హెచ్చరిక జారీ చేశారు. కానీ నిందితుడు సహకరించలేదు. కాజీపేట పోలీసులు రెండు రౌండ్లు కాల్పులు జరిపాడు, ఒక రౌండ్ గాలిలోకి మరో రౌండ్ లో నిందితుడి కాలిపై ఫైర్ చేశారు.నిందితుడికి కాళ్ళకి గాయమై చికిత్స కోసం రిమ్స్ కు తరలించడం జరిగింది.కడప జిల్లాలో మహిళలకు ఎటువంటి నేరాలకు పాల్పడిన పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పోలీసుల మీద తిరగబడితే ధైర్యంగా ఎదుర్కొంటాం, చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అన్నారు. మహిళల రక్షణ పట్ల ఎప్పుడు అప్రమత్తంగా ఉంటామన్నారు. రౌడీషీటర్లపై గట్టి చర్యలు పోలీసులు తీసుకుంటారన్నారు.క్రిమినల్‌లను ఎవరిని కూడా కడప పోలీసులు ఉపేక్షించరనీ స్పష్టం చేశారు. మృతురాలి తల్లిదండ్రులతో మాట్లాడడం జరిగిందన్నారు. నిందితునికి శిక్షపడేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.ప్రభుత్వం నుండి పోలీసుల నుండి ఉన్నతాధికారుల నుండి కీర్తన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.క్రిమినల్ చర్యలకు పాల్పడితే కడప పోలీసులు చర్యలు తీసుకుంటామని ఎస్పీ వార్నింగ్ ఇచ్చారు.



కడప రిమ్స్ లో పోస్ట్ మార్టం పూర్తయిన తర్వాత కీర్తన మృతదేహంవద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబ సభ్యులు



ఖాజీపేట నాలుగు రోడ్ల కూడలిలో నిందితుడిని ఎన్కౌంటర్ చేయాలని ధర్నా చేస్తున్న కీర్తన బంధువులు, గ్రామస్తులు



కడప రిమ్స్ లో చికిత్స పొందుతున్న హత్య కేసు నిందితుడు వెంకటేష్

గొప్ప సంఘ సంస్కర్త

## మహాత్మ జ్యోతిరావు పూలే

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



జ్యోతిరావు పూలే విగ్రహము వద్ద జగన్మోహన్ రాజు, టిడిపి నాయకులు

రాజంపేట, ఏప్రిల్ 11 ప్రభాతవార్త

స్వతంత్రం రాకముందే సామాజిక సమస్యలపై తిరుగుబాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పేర్కొన్నారు. శనివారం రాజంపేట పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహ వద్ద 200 వ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పార్టీ ముఖ్య నాయకులతో కలిసి నియోజకవర్గ ఇన్చార్జ్ చమర్తి జగన్ మోహన్ రాజు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.మహాత్మ జ్యోతిరావు పూలే గారిని స్ఫూర్తిగా తీసుకొని,వారి ఆశయాల సాధనకు,వారి అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు.నాగరికత లేని రోజుల్లోనే జ్యోతిరావు పూలే గారు జీవితమంతా బలహీన వర్గాల ప్రజలకు అంకితం చేశారన్నారు.అంతేకాకుండా ఆనాడు స్త్రీలకు స్వేచ్ఛ ఉండేది కాదని,తరతరాలుగా అణిచివేతకు గురయ్యారన్నారు.స్త్రీలు కూడా చదువుకుంటే పురుషులతో సమానంగా రాణించగలరని ఆ రోజుల్లో బాలికలకు ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత జ్యోతిరావు పూలేదేనని చమర్తి కొనియాడారు. నియోజకవర్గంలో బీసీలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికోసం కూటమిపని చేస్తుంది అన్నారు. బీసీల కోసం నియోజకవర్గంలో పాఠశాల విద్యకు సంబంధించి 28 కోట్లు, ఇంటర్ విద్యకు సంబంధించి తొమ్మిది కోట్లు కేటాయించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గన్నే సుబ్బనరసయ్య నాయుడు,పార్టీ ముఖ్య నాయకులు డాక్టర్ నవీన్, టి.సంజీవరావు, ఇదిమడకల కుమార్, మనుబోలు వెంకటేశ్వర్లు, మంద శీను, ఎస్కే కరీం తదితరులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే ఎంతటి వారినైనా

## ఉపేక్షించేది లేదు : డీఎస్పీ

- అటెంప్ట్ మర్డర్ కేసులో ముగ్గురు అరెస్ట్
- నాలుగు కట్టెలు స్వాధీనం

పులివెందుల, ఏప్రిల్ 11 , ప్రభాతవార్త :

నేరాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని డి.ఎస్.పి మురళి నాయక్ అన్నారు. శనివారం స్థానిక అర్బన్ స్టేషన్ నందు అర్బన్ సిబ్బందితో కలసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో డిఎస్పి మురళి నాయక్ మాట్లాడుతూ పులివెందుల పట్టణంలో పడగొట్టిన బస్టాండ్ నందు జగదీష్ పై జరిగిన ఘర్షణలో నమోదైన అటెంప్ట్ మర్డర్ కేసులో కీలక పురోగతి సాధించామని ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, నేరానికి ఉపయోగించిన నాలుగు కట్టెలను స్వాధీనం చేసుకు న్నట్లు ఆయన తెలిపారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నచ్చికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్ సీఐ శ్రీరామ్ తో కలిసి సిబ్బంది ప్రత్యేక దాడులు నిర్వహించా రనీ ఈ క్రమంలో ఇన్స్పెక్టర్ కె. శ్రీరామ్ నేతృత్వంలో శనివారం ఉదయం పట్టణంలోని పాత కరెంటు కార్యాలయం సమీపంలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారనీ ఈ కేసు సంబంధించి బత్తుల జగదీష్ ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్ 65/2020 కింద కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. అరెస్ట్ చేసిన వారిలో అల్లపాటి తిరిపాలు (34), తరిగెల విక్రం (29), కటిక శ్రీనివాసులు (42) ఉన్నారు. వీరిలో విక్రం పై గతంలో హత్య మరియు ఇతర గొడవల కేసులు నమోదై ఉండగా, రౌడీ షీట్ కూడా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. తిరిపాలు కూడా పలు జూదం కేసుల్లో నిందితుడిగా ఉన్నాడనీ నిందితుల వద్ద నుండి నేరానికి ఉపయోగించిన నాలుగు కట్టెలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో మరో నిందితుడు చిన్నా అలియాస్ పేనుగొండ తరుణ్ పరారీలో ఉన్నాడన్నారు. అతన్ని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయనీ తెలిపారు. పులివెందుల డివిజన్ పరిధిలో శాంతిభ ద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ మురళి నాయక్

## ఆపరేషన్ వజ్రప్రహార్

ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు సబ్ డివిజన్ అధికారి విభూకృష్ణ పర్యవేక్షణలో ప్రొద్దుటూరు సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ప్రొద్దుటూరు 1వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని ఈశ్వర్‌రెడ్డినగర్‌లో అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలోనూ, రౌడీషీటర్ల, సస్పెక్ట్ సీటర్ల ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ ఆపరేషన్ వజ్రప్రహార్ కార్యక్రమంలో సరైన పత్రాలు లేని 92 వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. అలాగే ఈశ్వర్‌రెడ్డినగర్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ సీటర్లను మంచి నడవడికకై కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది. ప్రజలందరూ అసాంఘిక కార్యక్రమాలు అయిన గంజాయి, క్రికెట్ బెట్టింగ్, మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని హెచ్చరించడం జరిగగింది. ఇంటి యజమానులు తమ విలువైన వస్తువులను బ్యాంకులలో భద్రపరచుకోవాలని వేసవిలో దొంగతనాలు అధికంగా జరిగే అవకాశం ఉందని జాగ్రత్తలు పాటించాలన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వలన పోలీసు శాఖకు సహకరించి తగిన సలహాలు, సమాచారాన్ని అందించాలని జిల్లా ఏఎస్పీ కోరారు.





## జ్యోతిరావు ఫూలే గొప్ప కార్యాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

కడప కార్పొరేషన్ ఏప్రిల్ 11 ప్రభాతవార్త:

యువత జ్యోతిరావు ఫూలే గొప్ప కార్యాలను యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ఆయన చూపిన మార్గాన్ని అనుసరించి సమానత్వం, సామాజిక న్యాయం సాధనలో ముందుకు రావాలని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆలంఖాన్ పల్లి లక్ష్మీ రెడ్డి అన్నారు. శనివారం జ్యోతిరావు పూలే 200 వ జయంతిని పురస్కరించుకొని పాత బస్టాండ్ లో ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. 1848 లో ఆయన స్థాపించిన శీతల పాఠశాలలు కుల వివక్ష నిర్మూలన, బాలికల విద్యా ప్రాధాన్యత వంటి అంశాల్లో ఆయన తీసుకున్న మార్గాలు మనందరికీ ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. జ్యోతిరావు ఫూలే వారి జీవితం, వారి కృషి మనందరికీ మార్గనిర్దేశకమని, వారి ఆలోచనలు ఇప్పటికీ ప్రస్తుత యువతకు ప్రేరణగా నిలుస్తున్నాయని తెలిపారు.

# అందరికీ ఆదర్శప్రాయుడు మహాత్మా జ్యోతిబా పూలే..

కడప, ఏప్రిల్ 11 ప్రభాతవార్త :

మహాత్మా జ్యోతిబా పూలే అందరికీ ఆదర్శ ప్రాయుడు అని, ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ పయనించాలని జేసీ డా. నిధి మీనా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలు నందు మహాత్మ జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలు జిల్లా బీసీ సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేసీ డా. నిధి మీనా హాజరవ్వగా అతిథులుగా రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ అభివృద్ధి డైరెక్టర్ వడ్ల శ్రీనివాసచారి, రాష్ట్ర సగర ఉప్పర సంక్షేమ అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ పేట చంద్రశేఖర్, రాష్ట్ర గిరిజన కార్పోరేషన్ డైరెక్టర్ మేదర రవికుమార్, రాష్ట్ర వేర్ హౌస్ కార్పోరేషన్ డైరెక్టర్ ఎం. శ్రీధర్, రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్య, రాష్ట్ర నూరు భాష అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ నగూర్ వీరభద్రుడు, రాష్ట్ర దాసరి అభివృద్ధి సంక్షేమ కార్పోరేషన్ డైరెక్టర్ గోవింద్ సుబ్బయ్య, రాష్ట్ర యాదవ్ అభివృద్ధి కార్పోరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ యాదవ్ తడిత ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.ఈ సందర్భంగా జేసీ డా. నిధి మీనా మాట్లాడుతూ.. సామాన్య జీవితంతో అసాధారణంగా కృషి చేసిన మహాత్మ జ్యోతిబా పూలే వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి అన్నారు. "సత్య షోడచ సమాజం" అనే సంస్థను నెలకొల్పిన ఆయన అన్ని వర్గాల వారి మధ్య అసమానతలు తొలగించేందుకు కృషిచేసిన గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. సమాన హక్కుల కొరకు, కులవ్యవస్థ నిర్మూలనకు, అట్టడుగు జాతుల విద్యాభివృద్ధి కోసం.. సమాజంలో విప్లవాత్మక మార్పులు తీసుకొనివచ్చారన్నారు. డిఆర్వో మల్లికార్జున మాట్లాడుతూ కుల వ్యవస్థను రూపుమాపాలంటే ప్రతి ఒక్కరూ ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నతంగా అభివృద్ధి చెందినపుడే సాధ్యమవుతుందన్నారు. వీటన్నింటినీ అధిగమించాలంటే.. ఒక్క విద్య వల్లనే సాధ్యం అవుతుందని అనుభవ పూర్వకంగా గ్రహించిన అధ్యయనకర్త జ్యోతిరావు పూలే అన్నారు. ఎస్డీసీ వెంకటపతి మాట్లాడుతూ బాలికల విద్యను ప్రోత్సహించిన మొట్టమొదటి స్ఫూర్తిదాయకమైన మహనీయులు జ్యోతిరావు పూలే అని గుర్తు చేశారు. అహంకారం, ఆధిపత్యం, అజ్ఞానం, అంధకారం అంటే గిట్టని జ్యోతిబా పూలే అందరి ఆనందాన్ని కోరే ఆశావాది అని.., ఆయన అందరికీ ఆరాధ్యుడు అని అభివర్ణించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు.. అభివృద్ధి అనేది ఒక్కరోజే సాధ్యం కాదు.. ఓపిక సహనంతో నితంతర కృషితోనే.. సమాజంలో మార్పు, అభివృద్ధి సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే లాంటి మహానుభావులు మన భారతావనిలో ఎంతో మంది ఉన్నారని.. వారందరి అడుగుజాడల్లో నడిస్తే.. సమాజంలో మార్పు అనేది జరుగుతుందన్నారు. ఇలాంటి మహనీయులు స్మరించుకొనే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించడం మన అదృష్టం అన్నారు. కార్యక్రమానికి ముందుగా మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి ముఖ్య అతిథులు పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు మునుపు పాత బస్టాండు వద్ద పూలే సర్కిల్ లోని మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జున, సాంఘీక, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సరస్వతి లు, పూల మాల వేసి.. ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జున, జిల్లా సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ అధికారి సరస్వతీ, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడి జయసింహలు, కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి విజయ్ కుమార్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది, బీసీ సంక్షేమ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## మహాసభను జయప్రదం చేయండి




బద్వేలు అర్బన్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త

17న జరిగే ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ మహాసభను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి. వి రమణ అన్నారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికుల పట్ల పెద్ద ఎత్తున వివక్ష చూపుతూ కార్మికులకు హక్కుగా ఉన్నటువంటి చట్టాలను రద్దుచేసి రాబోయే ప్రభుత్వాలకు బానిసలుగా కార్మికులను కార్మిక కుటుంబాలను రోడ్డుకు లాగే విధంగా వ్యవహరిస్తూ ఎన్నో సంవత్సరాలుగా వారు కష్టపడి సంపాదించుకున్నటువంటి చట్టాలను రద్దు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏఐటీయూసీ నిరంతరం కార్మికుల పక్షాన నిలిచి పోరాడుతుందని రాష్ట్రంలో ఐక్యకార్మికోద్యమ నిర్మాణానికి ఐక్య పోరాటానికి ముందు పీఠిన నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు నరసింహ, నాగేష్, ఏఐటీయూసీ గోపవరం మండల అధ్యక్ష కార్యదర్శులు గురయ్యా ఓబులేసు లారీ యూనియన్ నాయకులు రవీంద్ర కృష్ణ రవి వెంకటేశు మళ్లీ పాల్గొన్నారు.

## తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ



ముద్దనూరు,ఏప్రిల్ 11, ప్రభాతవార్త:

పట్టణ పరిధిలోని హెబ్రోన్ చర్చి వీధిలో గురువారం రాత్రి తాళం వేసిన ఇంటిని గమనించి తాళం పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు బాధితురాలు తన తల్లి కంటి ఆపరేషన్ కొరకు గురువారం ఇంటికి తాళం వేసి వెళ్లగా తిరిగి శనివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి బీరువాను ధ్వంసం చేసి అందులోని 20వేల రూపాయల నగదు, సుమారు మూడు గ్రాముల బంగారు కమ్మలు కనిపించకుండా పోవుసరికి స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా సిఐ నగేష్ బాబు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి బాధితురాలు రాచినేని నాగలచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మండలవాసులు కుటుంబ సభ్యుల ఊర్లకు వెళుతుంటే చుట్టుపక్కల వారిని తమ ఇంటిని గమనిస్తూ ఉండాలని, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడం కానీ తగినన్ని జాగ్రత్తలు తీసుకొని వెళ్లాలని ప్రజలకు సూచించారు. ఎవరైనా అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

గొర్రెల దొంగతనం కేసులో

## ఇరువురి పై కేసు నమోదు



ముద్దనూరు,ఏప్రిల్ 11, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కే తిమ్మాపురం కొలవాలి గ్రామాల సమీపంలో గొర్రెల మందపై రాత్రి సమయాలలో దాడి చేసి గొర్రెలను దొంగలించిన కేసులో ఇరువురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిఐ నగేష్ బాబు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు గత సంవత్సరం ఆగస్టు నెలలో తిమ్మాపురం గ్రామ సమీపంలో గొర్రెల దొడ్డి నుంచి గొర్రెలను దొంగతనం చేసి, అదే ఏడాది నవంబర్ నెలలో కొలవలి గ్రామ సమీపంలోని గొర్రెల మంద పై దాడి చేసి గొర్రెలు దొంగలించిన ఘటనలపై కేసుల దర్యాప్తులో భాగంగా శనివారం నాడు పట్టణ పరిధిలోని ఉమ్మారెడ్డి పల్లె గ్రామ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం, గద్దరగుట్టపల్లె గ్రామానికి చెందిన మేరసరి గంగరాజు, మెరసరి చంద్రకూలయ్య లను అదుపులోకి తీసుకొని ఇరువురిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్లు పేర్కొన్నారు.

## జ్యోతిరావు పూలే సేవలు మరువలేనివి

బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 11 ప్రభాతవార్త :



నేటి యువత ప్రతి ఒక్కరు మహాత్మ జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలని బద్వేల్ అర్బన్ ఎస్ఐ నాగ చిరంజీవి అన్నారు, శనివారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా సిద్ధవటం రోడ్డులోని ఆయన కాంస్య విగ్రహానికి ఎస్సై నాగ చిరంజీవి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక విప్లవకారుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు మరువలేను అన్నారు, స్త్రీ విద్య కోసం, సమాజంలో సమానత్వం కోసం నిరంతరం పోరాడిన ధీశాలి పూలే అట్టడుగు వర్గాలకు విద్యే గొప్ప ఆయుధమని నమ్మి, సమాజంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన ఆయన ఆశయాలు నేటికీ మనందరికీ స్ఫూర్తిదాయకమన్నారు, మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ, వారి సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని వారు అన్నారు,ఈ కార్యక్రమంలో గురుమూర్తి, పోలీస్ వెంకటేష్, హోంగార్డు సుధాకర్, నాగరాజా, సత్తార్ పలువురు ప్రజా సంఘాల నాయకులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ఎస్ రోడ్డు లో చోరీ

నందలూరు ఏప్రిల్ 11 ప్రభాతవార్త :

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లి లోని ఆర్ఎస్ రోడ్డు లోని ఓ ఇంటిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. చోరీ జరిగిన విషయం తెలిసిన పోలీసులు శనివారం నాడు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. ఇంటిలోని వారు హైదరాబాదుకు వెళ్లి ఉన్నారు. గత పది రోజులుగా వారు ఇంటిలో లేరు. చోరీ జరిగిన విషయాన్ని స్థానికులు ఇంటి యజమానులకు సమాచారం అందజేశారు. ఇంటిలో ఏ వస్తువులు చోరీ అయ్యాయన్న విషయం ఆ ఇంట్లో వారు వస్తే తెలిసే అవకాశం ఉంది.

## మధ్యాహ్న భోజనంపై ఆరా

క్లాసుల నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రోత్సాహంగా నోట్‌బుక్కులు, రైటింగ్ ప్యాడ్‌లు (అట్టలు), పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన' పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు డైనింగ్ హాల్‌లో ఫ్యాన్లు లేక ఇబ్బంది పడుతున్నామని తెలియజేయగా, వెంటనే స్పందించి ఫ్యాన్ల ఏర్పాటు చేయించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేలు కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్న, మున్సిపాలిటీ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బసిరెడ్డి రవికుమార్ రెడ్డి, పాపుదిప్పు మల్లికార్జున రెడ్డి, రామచంద్రారెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సీతా వెంకటసుబ్బయ్య, కొడవలి వేణుగోపాల్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణం



నందలూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:

మండలంలోని నారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నారాయణ రాజుపేట గ్రామంలో శనివారం సీతారాముల కళ్యాణ వేడుకలు గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో సీతారాముల ఉత్సవ మూర్తులను వేదికపై అత్యంత సుందరంగా ముస్తాబు చేసి ఆసీనులు గావించారు. భక్తుల రామనామ స్మరణల నడుమ కళ్యాణం కన్నుల పండుగ జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాయన పల్లి వెంకటసుబ్బయ్య, సూర్యనారాయణ, శశి కుమార్, కానకుర్తి వెంకటయ్య, సిరిసల నాగేంద్ర. మస్తాన్ రాయల్,శివకుమార్. ఎముక దుర్గయ్య, బద్రి రమేష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



నందలూరు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:

నందలూరు మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని అరవపల్లె ఆర్‌బీ సముదాయం వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు తాటి సుబ్బరాయుడు ఆధ్వర్యం వహించగా, జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గంటా గోపి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆయన నమ్మకం సమాజానికి మార్గదర్శకమని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, కార్యదర్శి గొబ్బిళ్ల సుబ్బరాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, జంబు సూర్యనారాయణ, మోడపోతుల రాము, నారపుశెట్టి శివ, గంధం గంగాధర్, పాటూరు రమేష్, సిరిసాల నాగేంద్ర, జిల్లా మైనారిటీ నాయకుడు సయ్యద్ అమీర్, మహబూబ్ బాషా, చామంచి పెంచలయ్య, కానకుర్తి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల అభివృద్ధికై పూలే కృషి స్ఫూర్తిదాయకం

ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర మాదిగ



ప్రొద్దుటూరు ఏప్రిల్ 11 ప్రభాతవార్త

దేశంలో అంటరానితనం నిర్మూలన బడుగు బలహీన వర్గాల అభివృద్ధికై మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన నిరంతర కృషి స్ఫూర్తి దాయకమని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అమ్మలదిన్నె సుధాకర మాదిగ కొనియాడారు. శనివారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా స్థానిక బీసీ సమైక్య కార్యాలయం నందు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అంటరానితనాన్ని నిర్మూలించడమే కాకుండా ప్రతి ఒక్కరికి చదువుకునే అవకాశం కల్పించాలని చెప్పిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని తెలిపారు. బడుగు బలహీన వర్గాల కోసం పోరాటం చేసిన వ్యక్తి అని అలాగే మన భారత దేశ రాజ్యాంగ నిర్మాత అధ్యక్షులు అయిన బాబాసాహెబ్ అంబేద్కర్ కి కూడా దిశా దిక్సూచి నిర్దేశాన్ని ఇచ్చిన మహనీయుడు పూలే అన్నారు. అప్పట్లోనే అగ్రవర్ణ వాళ్ల పైన పూలే పోరాటం చేశారని తెలిపారు రాజ్యాంగం అమలులో లేకుండా బ్రిటీష్ కాలంలోనే పాలకులను అగ్రవర్ణాల వారిని వ్యతిరేకించి వారి ప్రవర్తనను ప్రశ్నిస్తూ నిరదిసినటువంటి వ్యక్తి మహనీయుడు జ్యోతిరావు పూలే అని అన్నారు జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ప్రతి సంవత్సరం మనమంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో తీట్ల రాజేష్ పూజారి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## 14న అంబేద్కర్ జయంతి వేడుకలు

జమ్మలమడుగు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:

ఈ నెల 14న డా.బీఆర్ అంబేద్కర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు తాళ్లపాక వినోద్‌కుమార్ తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి క్యాంబెల్ ఆసుపత్రిలో జాతీయ అధ్యక్షులు రామాజీ ఇమ్మానియేల్ చేతుల మీదుగా రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## వసూలు కౌంటర్ తెరిచి ఉంటుంది

మైదుకూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:

మైదుకూరు నియోజకవర్గం నందు ఆదివారం సెలవు అయినప్పటికీ వినియోగదారుల సౌకర్యార్థం అన్ని మండలాలలో విద్యుత్ ఛార్జీల వసూలు కౌంటర్లు తెరిచి ఉంటాయని గత నెలలో ఇచ్చిన విద్యుత్ బిల్లుల చెల్లింపుకు సంబంధించి రేపటి దినము చివరి రోజు కాబట్టి విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం రేపు ఆదివారం అయినప్పటికీ పూర్తి స్థాయిలో మైదుకూరు , ఖాజీపేట , దువ్వూరు , చాపాడు మరియు వనిపెంట సెక్షన్ లలో పట్టణ ప్రాంతంలో మరియు గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కౌంటర్లు యధావిధిగా తెరిచి ఉంటాయి, కనుక ప్రజలు గమనించి రేపు మీకు సంబంధించిన విద్యుత్ బకాయిలు చెల్లించాలని సబ్ డివిజన్ అధికారి శ్రీకాంత్ స్పష్టంచేశారు. సోమవారం నుండి ఆలస్యంగా చెల్లిస్తున్నందుకు అపరాధ రుసుముతో పాటు రీ కనెక్షన్ ఫీజు వసూలు చేయబడుతుందని ఈ విషయాన్ని గమనించాలని తెలియజేశారు.

## చలివేంద్రం ఏర్పాటు

కలసపాడు, ఏప్రిల్ 11 ప్రభాతవార్త:



మండలంలోని చెన్నారెడ్డి పల్లె గ్రామ బస్టాండ్ లో శనివారం కొత్త కోట సొసైటీ సీఈవో కొండ నారాయణ రెడ్డి ఉపాధ్యాయుడు జోజయ్య నాయుడు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాటసారుల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నారెడ్డి పల్లె గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్వో ప్లాంట్ ద్వారా మినరల్ వాటర్ వితరణ



బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 11 ప్రభాతవార్త :

బద్వేల్ పట్టణ పరిధి బోవిళ్ల వారిపల్లెలో సానపురెడ్డి వెంకట రాధాకృష్ణారెడ్డి, రామగోపాల్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, శివ గోపాల్ రెడ్డి, రామచంద్రారెడ్డి, మురళీ మనోహర్ రెడ్డి, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పదివేలు లెటర్స్ ఆర్వో ప్లాంటును శనివారం సానపురెడ్డి మనోహర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు, ప్రస్తుతం వాటర్ క్యాన్ కొనాలంటే 10 అవుతున్న నేపథ్యంలో బోవిల్లవారిపల్లె గ్రామంలో ప్రతి ఒక్కరికి ఉచిత ఆర్వో ప్లాంట్ ద్వారా మంచినీటిన అందించాలని ఉద్దేశంతో సానపరెడ్డి రాధాకృష్ణారెడ్డి కుటుంబ సభ్యుల సహకారంతో ఆర్వో ప్లాంటును ప్రారంభించడం జరిగిందన్నారు, ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంతంలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు, సానపురెడ్డి వెంకట రాధాకృష్ణారెడ్డి,మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఆర్వో ప్లాంట్ ద్వారా నీటిలోని హానికర రసాయనాలు, భార లోహాలు మరియు సూక్ష్మక్రిములు తొలగిపోవడమే కాకుండా, కఠిన జలం మృదువుగా మారి ప్రజలకు సురక్షితమైన, రుచికరమైన తాగునీరు అందుతుందన్నారు, ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి



యర్రగుంట్ల ఏప్రిల్ 11 ప్రభాతవార్త :

జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ మరియు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహానేత జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం కోసం జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సంస్కర్త అని,విద్యే సమాజాన్ని మార్చగల శక్తి అని నమ్మి, అణగారిన వర్గాలకు విద్యా మార్గం చూపించిన మహోన్నతుడు అని అన్నారు. మహిళల విద్యాభివృద్ధికి మొదటి అడుగు వేసి, సమాజంలో నూతన చైతన్యాన్ని తీసుకువచ్చిన మహానుభావుడు పూలే అని తెలిపారు. కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడి, న్యాయం మరియు సమానత్వం కోసం నిరంతరం కృషి చేసిన మహా నాయకుడు అని,అలాంటి గొప్ప వ్యక్తిని, ఆయన జయంతి రోజును గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎస్ వి.హెచ్.పి మరియు హిందూ బంధువులు పాల్గొన్నారు.

## జ్యోతిబా పూలే హాస్టల్ సందర్శించిన భూపేష్



జమ్మలమడుగు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:

మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా శనివారం జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని రామిరెడ్డిపల్లె రోడ్డు నందు ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే హాస్టల్‌ను కడప జిల్లా తెదేపా అధ్యక్షులు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి సందర్శించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పూలే విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, కొత్తపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ శివచంద్రారెడ్డి, ఐఎల్, చిన్న,నవీన్ రాయల్, బాలకృష్ణ, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

సిద్ధవటం ఏప్రిల్ 11 ప్రభాతవార్త

మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు సందర్భంగా 11వ పోలీస్ పటాలయంలో శనివారం ఘనంగా జరిగాయి ఈ సందర్భంగా పోలీస్ అసిస్టెంట్ కమాండెంట్ వెంకటప్ప మాట్లాడుతూ జ్యోతిరావు పూలే భారతీయ సామాజిక సంస్కర్త రచయిత మరియు పేద కార్మికుల మహిళలు సహా అందరికీ సమానత్వం హక్కులు కలిగించి ఆదర్శంగా నిలిచారని నాగరికత లేని రోజుల్లో జ్యోతిరావు పూలే జీవితం అంతా బలహీన వర్గాల ప్రజలకే అంకితం చేశారన్నారు ఈ కార్యక్రమంలో బెటాలియన్ పోలీసులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం నిర్వహించడం అభినందనీయం

మున్సిపల్ కమిషనర్ చిత్తా రవిచంద్రా రెడ్డి



ప్రొద్దుటూరు, ఏప్రిల్ 11 ప్రభాత వార్త

ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 14వ వార్డులో ఉన్న మున్సిపల్ ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవాన్ని స్థానిక మాజీ కౌన్సిలర్ షేక్ జిలాని భాష ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ చిత్తా రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని స్థానిక శ్రీనివాసనగర్లో శనివారం మాజీ కౌన్సిలర్ జిలాని భాష ఆధ్వర్యంలో నిర్వహించిన మున్సిపల్ ఉర్దూ ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవం లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పురపాలిక ఉర్దూ ప్రాథమిక పాఠశాల, పురపాలక తెలుగు ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి కమిషనర్ రవి చంద్రారెడ్డి మాట్లాడుతూ విద్య అంటే కేవలం ప్రైవేట్ పాఠశాలల్లో నే కాదు ప్రస్తుత రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా వార్షికోత్సవం నిర్వహించడం వల్ల విద్యార్థులలో మరింత ఉత్సాహం పెరిగే అవకాశం ఉందన్నారు. మండల విద్యాశాఖ అధికారి శోభారాణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చక్కగా విద్య వసతులు ఉన్నాయని తల్లిదండ్రులు విద్యార్థులను క్రమం తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపి మంచి ఫలితాలు పొందాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇలాంటి ప్రోత్సాహకర కార్యక్రమాలు నిర్వహించడం మాజీ కౌన్సిలర్ జిలాని భాషను కొనియాడారు. ఈ సందర్భంగా డాన్స్ మాస్టర్ సెల్వం సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సావిత్రమ్మ,హెచ్‌ఎంలు హిమబిందు,శ్రీనివాసులు, పాఠశాలల యాజమాన్య కమిటీలు పాల్గొన్నారు.

## బడుగుల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే



బద్వేలు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని బద్వేల్ నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్‌చార్జ్ కె. రితేష్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. బద్వేలు మున్సిపాలిటీలోని సిద్ధవటం రోడ్డులో గల పూలే గారి విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహాత్మా పూలే గారు అణగారిన వర్గాల అభ్యున్నతి, సమాన హక్కుల సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. సమాజంలో కుల వివక్ష నిర్మూలన, సమానత్వ స్థాపనలో ఆయన చేసిన సేవలు అపారమని అన్నారు. అలాగే, తన సహచరిణి సావిత్రీబాయి పూలే గారితో కలిసి 1848లోనే బాలికల కోసం దేశంలో తొలి పాఠశాలను స్థాపించి మహిళా సాధికారతకు మార్గదర్శకుడిగా నిలిచారని కొనియాడారు. పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బద్వేలు కూటమి అభ్యర్థి బొజ్జ రోషన్న, మున్సిపాలిటీ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు బసిరెడ్డి రవికుమార్ రెడ్డి , పాపుదిప్పు మల్లికార్జున రెడ్డి రామచంద్రారెడ్డి , జిల్లా వైస్ ప్రెసిడెంట్ సీతా వెంకటసుబ్బయ్య, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కొడవలి వేణుగోపాల్ తదితర నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమ రేషన్ బియ్యం స్వాధీనం

బద్వేలు ,ఏప్రిల్ 11, ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని గుంతపల్లె బ్రిడ్జి కింద నడిరోడ్డుపై అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇంటింటికి వెళ్లి రేషన్ బియ్యం కొనుగోలు చేసి రోడ్డుపైనే నిల్వ ఉంచినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివశంకర్ మరియు సిబ్బంది దాడులు నిర్వహించి మొత్తం 59 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి శబరి కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి, స్వాధీనం చేసిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. అధికారులు అక్రమ రేషన్ బియ్యం వ్యాపారంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## అన్నా చెల్లి అనుబంధానికే కళంకం తెచ్చిన షర్మిల

!జగన్ లాంటి అన్న దొరకడం పూర్వజన్మ సుకృతం

పులివెందుల, ఏప్రిల్ 11 , ప్రభాతవార్త :

షర్మిల నీలాంటి వారంతా ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసినా, అక్రమ కేసులు పెట్టిన,కుట్రలు ఛేదించు కొని,అన్నింటినితట్టుకొని జిల్లా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి అవినాష్ అని ఆయన అంటే జిల్లా ప్రజలకు, జిల్లా రైతులకు ఒక ధైర్యం, ఒక భరోసా, ఒక బలం అని వైసీపీ మాజీ కౌన్సిలర్లు లక్ష్మి భార్గవి, లక్ష్మి ప్రసన్న ,కాంతమ్మలు అన్నారు. పులివెందుల పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ షర్మిల నువ్వు కొంగు పట్టుకొని జిల్లా అంత తిరిగి ఆయన పై బురద చల్లే ప్రయత్నం చేసిన, ఆయన ప్రతిష్ట దిగజార్చాలనే ప్రయత్నం చేసిన ప్రజలు అవినాష్ రెడ్డి కి ఎంపీ గా పట్టం కట్టారని అదీ అవినాష్ అంటే అన్నారు. నిన్న ఖాజీపేటలో పట్టపగలే ముక్కుపచ్చలారని ఆడపిల్లను దారుణంగా గొంతు కోసి హత్య చేశారు,ఆంధ్ర రాష్ట్రం లో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందినీ కూటమి ప్రభుత్వ పెద్దలు భాదితులకు అండగా కాకుండా నేరస్తులకు అండగా నిలవడం బాధాకరం అన్నారు. షర్మిల ఆడబిడ్డలకు జరుగుతున్న అన్యాయంపై ఒక్క మాట మాట్లాడటం లేదు, షర్మిలమ్మ కేవలం స్వార్థం కోసం ఆస్తి కోసమే జగన్ పై ఆరోపణలు చేస్తున్నారనీ జగన్ అన్న మావిగన్ ఆలోచనను అయిదున్నర కోట్ల మంది ప్రజలు హర్షిస్తుంటే షర్మిలమ్మ జోక్ అని చెప్పడం విడ్డూరం గా ఉందన్నారు. జగన్ చెల్లివి , వైయస్సార్ కూతురువి కాబట్టే నీకు గౌరవం ఇస్తున్నాం, ఇకమీదట జగన్ మోహన్ రెడ్డి మీద అవినాష్ రెడ్డి మీద అనవసర ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వైయస్సార్ పేరును ఎఫ్ఐఆర్‌లో చేర్చిన కాంగ్రెస్ పార్టీ లో ఉంటూ వైయస్సార్ ను విమర్శించే కూటమి పార్టీకి మద్దతు ఇవ్వడం నీ నీచ రాజకీయాలకు పరాకాష్ట అని అన్నారు. ఈ కార్యక్రమం లో వైసీపీ మాజీ మహిళా కౌన్సిలర్‌లు లక్ష్మి ప్రసన్న, లక్ష్మి భార్గవి, కాంతమ్మ, మహిళా నేతలు ఇమాంభీ, సలీమా తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహిళా కౌన్సిలర్లు లక్షి ్మ భార్గవి తదితరులు

# అసలైన రాయలసీమ ద్రోహి చంద్రబాబే

**మతి భ్రమించి మాట్లాడుతున్న రాంగోపాల్ రెడ్డి**

**జగన్ పాలనపై విమర్శలు అనుచితమం**

**వైయస్సార్,జగన్ లతో నే ప్రాజెక్టుల అభివృద్ధి**

**వైసీపీ నాయకులు**



**పులివెందుల ఏప్రిల్ 11 ప్రభాతవార్త :**

రాయలసీమ అసలు ద్రోహి చంద్రబాబు నాయుడే అని వాస్తవాలు తెలియకుండా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నాడని నాడు వైయస్సార్ నిన్న జగన్ వాళ్ళని రాయలసీమ ప్రాంతంలో ప్రాజెక్టుల నిర్మాణాలు చర వేగంగా జరిగాయని వైసీపీ నాయకులు అంబకపల్లి నారాయణ స్వామి, ఒతూరు రసూల్ తదితర నాయకులు రాంగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై మండి పడ్డారు. శనివారం పట్టణంలో స్థానిక వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో వారు మాట్లాడుతూ రాయలసీమకు అసలైన ద్రోహి చంద్రబాబేనని, ఆయన పాలనలో ఈ ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరిగిందని వ్యాఖ్యానించారు. అదే సమయంలో భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ, అవి వాస్తవాలకు విరుద్ధమని పేర్కొన్నారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని విమర్శించే స్థాయి ఆయనకు లేదని ఘాటుగా స్పందించా రు.రాయలసీమ అభివృద్ధికి వైఎస్ రాజశేఖర రెడ్డి మరియు జగన్ మోహన్ రెడ్డి చేసిన సేవలను గుర్తుచేస్తూ, వారి పాలనలోనే ప్రాంతం సస్యశ్యామలంగా మారిందని చెప్పారు. హెచ్ఎన్ఎస్ఎస్, జీ ఎన్ఎస్ఎస్, ఎస్ఆర్బీసీ, వెలిగొండ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులు వైయస్సార్ కుటుంబ పాలనలోనే ప్రారంభమై ముందుకు సాగాయని పేర్కొన్నారు.ఇక సిబిఆర్ సామర్థ్యాన్ని 10 టీఎంసీలకు పెంచిన ఘనత కూడా జగన్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. మరో వైపు, రాయలసీమను రత్నాల సీమగా మార్చే లక్ష్యంతో రూపొందించిన రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును చంద్రబాబు నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. మాజీ ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి గురించి మాట్లాడే ముందు నేతలు తమ మాటలను అదుపులో పెట్టుకోవాలని హెచ్చరిస్తూ, రాజకీయ విమర్శలు బాధ్యతా యుతంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మాజీ మున్సిపల్ చైర్మన్ హఫీజ్, రాష్ట్ర సివిల్ సప్లై మాజీ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి , విజయ భాస్కర్ రెడ్డి,కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 29 నుంచి భువనగిరి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

**మే 2న నరసింహస్వామి కళ్యాణం**



బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లు ఆవిష్కరణ చేస్తున్న పసుపులేటి పవన్

**రాజంపేట ఏప్రిల్ 11 ప్రభాతవార్త**

రాజంపేట మండలం భువనగిరి పల్లె కొండపై వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 29 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య తనయుడు వీర పవన్ కుమార్ ఆలయ ధర్మకర్త మండలి సభ్యులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 30న నృసింహ జయంతి జరుగుతుంది. మే 2న లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలమడలి సభ్యులు లక్ష్మీ నరసయ్య, పూల హరిప్రసాద్, కావేరి గారి వెంకటరమణ, నామాల రాజశేఖర్, కంబాయి గారి సుబ్బనరసింహులు, కొమ్మూరు సుబ్బ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య..

**యర్రగుంట్ల ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

కలమల్ల ముద్దనూరు మార్గ మధ్యం లోని రైల్వే పట్టాలపై రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు శనివారం యర్రగుంట్ల జీఆర్పిఎఫ్ ఎస్.ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు వేముల మండలం పెద్ద జూటూరు గ్రామానికి చెందిన మర్రిబోయిన నాగార్జున (30) రైలు వచ్చే సమయంలో పరిగెత్తుకుంటూ వచ్చి రైలు పట్టాలపై పడుకున్నాడని దీంతో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు లోకో పైలట్ తెలిపినట్లు ఆయన వివరించారు. మృతుడి తండ్రి గంగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## పూలే ఆశయాలే మార్గదర్శి



**వేంపల్లె:ఏప్రిల్ 11(ప్రభాత వార్త )**

భారతమాత ముద్దు బిడ్డ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, అంటరానితనం నిర్మూలనకు కృషి చేసిన మహనీయ సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జనసేన పార్టీ నేత దాసరి రవిశంకర్ నివాళులర్పించారు. స్థానిక పట్టణంలోని ఆయన కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాసరి రవిశంకర్ మాట్లాడుతూ, సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహోన్నత వ్యక్తిత్వం పూలే అని కొనియాడారు. మహిళా విద్యాభివృద్ధికి, సమానత్వ సమాజ నిర్మాణానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని పూలే చూపిన మార్గం నేటి తరానికి కూడా ఆదర్శమని అన్నారు. బడుగు, బలహీన వర్గాల సాధికారత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు నారాయణ, కృష్ణ మోహన్, గంగన్న, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి




**వీరపునాయుని పల్లి ఏప్రిల్11, ప్రభాత వార్త**

మండలంలోని సర్వరాజుపేట లో ఎస్సై బీవీ కృష్ణయ్య విజువల్ పోలీసులు కార్యక్రమాన్ని నిర్వహించారుజిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు విజువల్ పోలీస్ లో భాగంగా రాత్రి వేళల్లో గ్రామాలను పోలీసు అధికారులు సందర్శించి ప్రస్తుతం జరుగుతున్న నేరాలు వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించి వారిని చైతన్య పరచాలని జిల్లా ఎస్పీ శ్రీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐ.పి.ఎస్ గారు ఆదేశించారు.ఈ సందర్భంగా వి.ఎన్ పల్లి ఎస్.ఐ బి.వి కృష్ణయ్య గారు మాట్లాడుతూ,పేకాట, గంజాయి, అక్రమ మద్యం, నాటు సారా విక్రయిస్తే అటువంటి వారిపై పోలీసు శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సైబర్ క్రైమ్, భూతగాదాలు, మహిళలు చిన్నారులపై జరిగే నేరాలు , చీటింగ్ , సోషల్ మీడియా పోస్టులు, పోక్సో కేసుల వంటి వాటిపై గ్రామ సభ నిర్వహించారు. అదేవిధంగా నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంటుందని ఎక్కడైనా గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేరాల నియంత్రణ కోసం పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని, అందులో భాగంగా ప్రజలు కూడా మీ గ్రామాలలో ఎక్కడైనా ఏ సమస్యలు ఉన్నా, అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని వి.ఎన్ పల్లి ఎస్.ఐ బి.వి కృష్ణయ్య తెలియజేశారు. అందరూ కలసి మెలసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆశాజ్యోతి పూలేకు టీడీపీ నేతల నివాళి



**పులివెందుల ఏప్రిల్ 11 , ప్రభాత వార్త :**

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు యర్రగుడిపల్లిలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పులివెందుల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ మారెడ్డి రవీందర్ నాథ్ రెడ్డి ఆదేశాల మేరకు జరిగింది. ఈ సందర్భంగా కార్యకర్తలు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సమాజంలో సమానత్వం, విద్యా ప్రాధాన్యత కోసం మహాత్మ పూలే చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మునెయ్య, డీలర్ రామాంజనేయులు, ఈశ్వరయ్య, సిద్దయ్య, హరి, రామకృష్ణ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## న్యాయ నిర్ణేతగా బాలగంగాధర్ ఎంపిక

**ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 11 ప్రభాత వార్త**



తిరుమల తిరుపతి దేవస్థానం మరియు శ్రీ వెంకటేశ్వర నాట్యకళా పరిషత్ సంయుక్తముగా నిర్వహిస్తున్న 2026 గరుడ అవార్డ్స్,72 వ జాతీయ స్థాయి పద్య నాటక పోటీలు 12.4.26 నుండి 28.4.2026 వరకు రెండు తెలుగు రాష్టాలకు సంబంధించి జరుగబోయే ఈ కార్యక్రమానికి ప్రాధమిక పరిశీలన నిమిత్తం న్యాయ నిర్ణేతగా రాష్ట్ర సగర సాంస్కృతిక విభాగం అధ్యక్షులు డాక్టర్ నీలం. బాలగంగాధర్ (తిలక్ )ఎంపిక ఎంపికయ్యారు.ఈ సందర్భంగా తిలక్ ని ఎర్రగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనపర్తి త్రివిక్రమ్ రెడ్డి కళాశాల సిబ్బంది మరియు, యస్.ఇ. ఏ స్టేట్అసోసియేషన్ అధ్యక్షులు ఇంజా. సోమశేఖర్ రెడ్డి అలాగే కాంట్రాక్టు అధ్యాపకుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోలు. నాగేంద్ర రెడ్డి అధ్యాపకులు వనం,బడాజిలాన్ పలువురు ప్రముఖులు అభినంధించి హర్షం వెలుబుచ్చారు. ఇలాంటి అవకాశాలు మరెన్నో రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే ఘన నివాళి..



**బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 11 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో బిజెపి మండల అధ్యక్షులు చంద్రఓబుల్ రెడ్డి మరియు మండల ఓబీసీ అధ్యక్షులు సారె రామానాయుడు ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలో కుల వివక్షంపై మొట్టమొదటి పోరాటం చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు. జ్యోతిరావు పూలే 1827 సంవత్సరం ఏప్రిల్ 11వ తేదీన మహారాష్ట్రలో జన్మించారు 1890 నవంబర్ 28 న మరణించారు కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ గులాం గిరి వంటి ప్రసిద్ధ గ్రంథాలు గాంధీజీ కంటే ముందే మహాత్మాగా గౌరవించబడ్డారు అని అన్నారు.జ్యోతిరావు పూలే నాకు స్ఫూర్తి ప్రదాత అని అంబేద్కర్ తెలియజేయడం జరిగింది జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే చేత 1848వ సంవత్సరం మహిళల కోసంపాఠశాలను ఏర్పాటు చేయడం జరిగింది మహిళలు చదువుకుంటే దేశం బాగుపడుతుంది అని నమ్మిన వ్యక్తి జ్యోతిరావు పూలే 1873వ సంవత్సరం సత్యశోధక సమాజం అనే సంస్థను స్థాపించి ఇంకా ఎన్నో సేవలు పోరాటాలు చేయడం జరిగినది ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రకాంతం ఈశ్వరయ్య, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి చిన్న గురయ్య పాల్గొన్నారు.

## ఆంధ్ర టు నవ్యాంధ్ర," గ్రంథ ఆవిష్కరణ



**ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 11 ప్రభాతవార్త**

సీనియర్ పాత్రికేయుడు, రచయిత, అన్నవరం బ్రహ్మయ్య రచించిన "ఆంధ్ర టు నవ్యాంధ్ర" గ్రంథ ఆవిష్కరణ శనివారం విజయవాడలోని బాలోత్సవ్ భవన్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ వసంత నాగేశ్వరరావు, మాజీ హోం మంత్రి వర్యులు, టిడి జనార్దన్ రావు, టిడిపి పొలిట్ బ్యూరో మెంబర్, ఆచార్య ఎన్ విజయ్ భాస్కర్, వైస్ ఛాన్సలర్, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, డాక్టర్ జివి పూర్ణచంద్, ప్రధాన కార్యదర్శి ప్రపంచ తెలుగు రచయితల సంఘం, శ్రీ గోళ్ళ నారాయణరావు, అధ్యక్షులు కామ్రేడ్ జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, ఏపీ అసెంబ్లీ ఓ ఎస్ డి డాక్టర్ ఎం ప్రభాకర్, పాల్గొన్నారు.

## పెరుగుతున్న పసుపు ధర

**దువ్వూరు, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**



మండల పరిధిలో రైతులు సాగు చేసిన పసుపు పంట దిగుబడి రావడంతో గత కొద్ది రోజులుగా ధర తగ్గిపోవడంతో పసుపు రైతులు ఆందోళన చెందుతుండగా గత రెండు, మూడు రోజుల నుంచి ఒక మోస్తారుగా పసుపు ధర పెరుగుతుండటంతో రైతులు తమ పంటను అమ్ముకోవచ్చునని భావిస్తున్నారు. పది రోజుల క్రితం క్వింటాల్ 9వేల నుండి 10 వేల రూపాయల వరకు ఉండగా గురు, శుక్ర, శనివారాల్లో కడప మార్కెట్ యార్డ్ నందు 13500 అలాగే దువ్వూరులో స్థానికంగా కొనుగోలు చేసే వ్యాపారులు క్వింటాల్ 13 వేలతో కొనుగోలు చేస్తున్నారు. దీంతో క్వింటాల్ పైన 3500 పెరిగింది. అలాగే విత్తనం పసుపు ధర గతంలో 5400 రూపాయలు ఉండగా ప్రస్తుతం 7వేల నుండి 7500 రూపాయల వరకు రైతుల విత్తనం పసుపును కొనుగోలు చేస్తున్నారు. పసుపు ధర మార్కెట్లో పెరగడంతో విత్తనం పసుపు కు డిమాండ్ ఏర్పడింది. దీంతో వచ్చే ఏడాది పసుపు సాగు చేసే రైతులు విత్తనం పసుపు ధరకు వివిధ ప్రాంతాలకు వెళుతున్నారు. పశ్చిమ ఆసియా యుద్ధం వల్ల గత పది రోజులుగా మంద గతిగా సాగున పసుపు ధర ప్రస్తుతం మోస్తారుగా పుంజుకోవడంతో వచ్చే ఏడాది రైతులు పసుపు పంటను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

## జిల్లా లక్ష్య సాధనలో బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి ప్రథమ స్థానం

**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 11, ప్రభాతవార్త**



బద్వేల్: 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమిస్తూ బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించింది. ఈ విషయాన్ని కమిటీ చైర్పర్సన్ నారిశెట్టి సుప్రజ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మార్కెటింగ్ సంచాలకులు గుంటూరు నుండి బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి రూ. 2.05 కోట్ల మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాన్ని నిర్దేశించగా, కమిటీ అధికారులు మరియు సిబ్బంది సమిష్టి కృషితో రూ. 2.21 కోట్లను వసూలు చేసి లక్ష్యాన్ని అధిగమించారు. దీంతో జిల్లా స్థాయిలో మొదటి స్థానాన్ని సంపాదించినట్లు తెలిపారు. ఈ విజయానికి సహకరించిన బద్వేల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి, అలాగే కూటమి నాయకులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు

**యర్రగుంట్ల :ఏప్రిల్ 11 ప్రభాతవార్త:**

మహాత్మా జోతిరావ్ పూలే 199 వ జయంతి సందర్భంగా యర్రగుంట్ల బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో బిసి నాయకులు పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి టెంకాయలు కొట్టి ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం ఆయన సేవలను కొనియాడారు ఈ సందర్భంగా బిసి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా వున్న బీసీలు అనాది కాలంగా విద్యా ఉద్యోగ వ్యాపార కాంట్రాక్ట్ వ్యవసాయ పెట్టుబడి రాజకీయ అధికార ఆర్థిక రంగాలలో ఇలా అనేక విధాలుగా దగా పడుతూ వెనుక బాటుకు గురౌతూ వస్తున్నారు అని ఇందుకు రాజకీయ పార్టీలు ప్రభుత్వాలె ప్రధాన కారణం అని ఎన్నికలు వచ్చినప్పుడల్లా బిసిల ఓట్లకోసం రాజకీయ పార్టీలు మేము అధికారం లోకి వస్తే రిజర్వేషన్లు పెంచుతాం అన్ని రంగాలలో బిసిలకు పెద్ద పీట వేస్తాం అనిచెప్పి అధికారంలోకి రాగానే వాగ్దానలను గాలికి వదిలేసి వాళ్ళ పార్టీలను కాపాడుకొంటూ వారు ఆర్థికంగా బలపడుతున్నారు తప్ప బిసిలకి ఇసుమంతయినా మేలు చెయ్యక పొగ బిసిలపై దాడులు ధ్వర్జన్యాలు చేస్తూ బిసిల భూములు లక్కోవడమే కాకా ఆదాయ వనరులపైన దాడులు చేసి కోళ్లగొడుతున్నారు అని వారు ఆవేదన చెందుతూ ప్రభుత్వాల పైన రాజకీయ పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు తక్షణమే బిసి రక్షణ చట్టం అమలుచేసి బిసిలపై దాడులు చేసినవారిపై కఠిన చర్యలు తీసికోవాలని అప్పుడే బీసీలు తమ భూములను ఆదాయ వనరులను కాపాడుకోగాలుగుతారని వారు ఆశభావం వ్యక్తం చేశారు బిసి కులాల కార్పొరేషన్ లకు భారీగా నిధులు కేటాయించి బిసిల ఆర్థికభివృద్ధికి తోడ్పాడాలని డిమాండ్ చేశారు రాజధాని ప్రాంతంలో బిసిలకు 1000 ఎకరాలు కేటాయించి బిసి పెట్టుబడి దారులకు బిసి కంపినిలకు చేయుతనందించాలని రాజధాని ప్రాంతంలో బిసి కులాల కమ్యూనిటీ భవనాల కొరకు స్థలాలు కేటాయించి భవనాలు నిర్మించాలి సమగ్ర బిసి కులగనన చేపట్టి ప్రభుత్వం ప్రవేటు విద్యా ఉద్యోగ కాంట్రాక్ట్ స్థానిక సమస్థలు చట్టసభలులలో 52 రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సాకే రాధాకృష్ణ. చంద్రగిరి రెడ్డయ్య. తోగడ సంఘం అధ్యక్షులు వెంకటేష్.ఉప్పు ఈశ్వరయ్య. తదితరులు పాల్గొన్నారు



# రాజధాని ప్రాంతాన్ని ఫ్రీ జోన్ గా ప్రకటించాలి

**వేంపల్లె ఏప్రిల్ 11 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని ఫ్రీ జోన్ గా ప్రకటించాలని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. తులసి రెడ్డి శనివారం వేంపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, పదోన్నతులు, బదిలీలు, విద్యాసంస్థల్లో ప్రవేశాల వంటి విషయాలలో స్థానిక, స్థానికేతరకు సంబంధించి రాష్ట్రాన్ని 26 జిల్లాలుగా, 6 జోన్లుగా, రెండు మల్టీ జోన్లుగా ప్రభుత్వం ప్రకటించడం జరిగిందన్నారు. ఇందులో స్థానికులకు 95, స్థానికేతరులకు ఐదు శాతంగా ప్రకటించడం జరిగింది. శ్రీకాకుళం, విజయనగరం,పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలను జోన్ 1 కింద, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ జిల్లాలను జోన్ 2 కింద, పశ్చిమగోదావరి,ఏలూరు, ఎన్టీఆర్ కృష్ణ జిల్లాలను జోన్ 3 కింద, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలను జోన్ 4 కింద, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్ఆర్ కడప జిల్లాలను జోన్ 5 కింద, కర్నూలు,నంద్యాల, అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలను జోన్ 6 కింద చేర్చడం జరిగింది. ఒకటి, రెండు,మూడు జోన్లను మల్టీ జోన్ వన్ కింద, జోన్ 4, 5, 6 లను మల్టీ జోన్ రెండు కింద చేర్చడం జరిగింది. రాష్ట్ర సచివాలయం రాజభవన్, హైకోర్టు,శాసనసభ, శాసనమండలి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్లు ఇవన్నీ మల్టీ జోన్ రెండు కింద ఉన్న, జోన్ నాలుగులో, గుంటూరు జిల్లాలో ఉన్నాయి,వీటిలో విద్యా,ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి రాష్ట్ర ప్రజలందరికీ సంబంధించిన కార్యాలయాలు. కాబట్టి రాష్ట్రంలోని అందరికీ వీటిలో సమాన అవకాశాలు ఉండాలి. సమాన అవకాశాలు ఉండాలి అంటే రాజధాని ప్రాంతంలోని రాష్ట్ర సచివాలయం,రాజ్ భవన్, హైకోర్టు,అసెంబ్లీ,శాసనమండలి, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్లను ఫ్రీ జోన్ గా ప్రకటించాలి.ఫ్రీ జోన్ గా ప్రకటించకపోతే రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల వారికి వీటిలో కేవలం ఐదు శాతం మాత్రమే అవకాశాలుంటాయి. స్థానికులకు 95!! అవకాశాలుంటాయి. రాజధాని ప్రాంతం అందరిదీ అన్న భావన రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల వారిలో ఉండకుండా పోయే ప్రమాదం ఉంటుంది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కూడా రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ శాసనమండలి హెడ్ అఫ్ ది డిపార్ట్మెంట్లను ఫ్రీ జోన్ గా ప్రకటించడం జరిగింది . అదే విధంగా నవ్యాంధ్రప్రదేశ్ లో రాజధాని ప్రాంతంలో ఉన్న రాష్ట్ర సచివాలయాన్ని, రాజభవన్ హైకోర్టును, శాసనసభను,శాసనమండలిని, హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్లను ఫ్రీ జోనుగా ప్రకటించాలని తులసిరెడ్డి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.



**బాధితురాలికి న్యాయం చేయాలంటూ**

# పోలీసులకు రాచమల్లు ఫిర్యాదు

**ప్రొద్దుటూరు ఏప్రిల్ 11 ప్రభాతవార్త**

మండల పరిధిలోని పూజ ఇంటర్నేషనల్ స్కూల్ లో పిల్లల చదువు కోసం చెల్లించిన ఐదు లక్షలు తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తున్నారని తక్షణమే బాధితురాలికి ఇప్పించి న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెందిన మెహర్బాజాన్ అనే పేద మహిళల చదువు కోసం ఒకేసారి ఐదు లక్షలు చెల్లించిందన్నారు. చెల్లించిన రెండు సంవత్సరాల అనంతరం పాఠశాల ఘర్షణ వాతావరణం ఉన్న కారణంగా మూతపడడంతో పిల్లలను ఆమె ఇతర స్కూళ్లలో చేర్పించిందన్నారు కానీ ఒకేసారి మొత్తం చెల్లించిన నేపథ్యంలో తిరిగి చెల్లించిన నగదును ఇవ్వమని అడగడానికి వెళ్లిన వైసిపి నాయకుల పై తప్పుడు కేసులు వ్రాయించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



ఈ కారణంగా పిల్లల చదువులు ఆగిపోయే పరిస్థితులు ఏర్పడడంతో పెద్ద శెట్టి పల్లె గ్రామ వైఎస్ఆర్సిపి నాయకులు సహాయంతో ఆమె నాటి ఎమ్మెల్యే తనను ఆశ్రయించిందని పేర్కొన్నారు ఆమె కుటుంబ పరిస్థితులను చూసిన తాను చెల్లించిపోయానని పేర్కొన్నారు. బాధితురాలికి స్కూల్ యాజమాన్యం డబ్బు చెల్లించే వరకు శాంతియుతంగా పోరాడుతామని, అందుకు పోలీసులు సహకరించాలని అన్నారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించరాదని, నిజమైన బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని వివరించారు.

## ఇరువురు ఆత్మహత్య - కేసు నమోదు

**ప్రొద్దుటూరు క్రైం, ఏప్రిల్ 11, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని లింగాపురం ఎస్సీ కాలనీకి చెందిన ఇరువురు శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న గ్రామస్థులు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకొని విచారణ చేయగా కర్నూలు జిల్లాకు చెందిన ఊరుకొండ గ్రామానికి చెందిన ప్రమీల(23), ఆమె భర్త రాజుతో విడిపోయి ఒకటిన్నర నెలల క్రితం లింగాపురంలో కాపురం ఉంటున్నారు. ఈమెకు ముత్తు (12), ప్రకాష్(7) కొండుకులున్నారు. ఈమెకు ఇక్కడే ఒక కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుకుంటున్న రంగస్వామితో అక్రమ సంబంధం ఉండడంతో వీరు ఇరువురు ఆమె చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పక్కింటి వారు విషయాన్ని పోలీసులకు తెలపడంతో వారు శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.



**CHANGE OF NAME**

★ **I, GOTURU GANGULANNA,** Son of VEMAIAH, residing at Door No. 1/34, Vemula Village, Vemula Mandal, YSR (Cuddapah) District, Andhra Pradesh - 516349, have changed my name to GOTURU ARJUN for astrological reasons. Henceforth, I shall be known as **GOTURU ARJUN** for all purposes, including all official and legal records.

